సాక్షి
శ్రీకాకుళం

1

ఆదివారం । 12 । నవంబర్ । 2023

న్యూస్‌రీల్

అగ్గిపుల్లపై బంగారు దీపం



కాశీబుగ్గ: దీపావళి సందర్భంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన కొత్తపల్లి రమేష్ ఆచారి పలుచటి బంగారం రేకు ఉపయోగించి దీపావళి లోగో తయారు చేశారు. 30 మిల్లీ గ్రాముల బంగారంతో రూపొందించిన ఈ లోగోను అగ్గిపుల్లపై నిలిపి ఆకట్టుకున్నారు.

ఘనంగా నరక చతుర్ధశి



నరకాసుర దహనం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ఉద్యాన మండపంలో శనివారం రాత్రి నరకచతుర్దశి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉషాపద్మినీఛాయ సమేతుడైన సూర్యనారాయణస్వామి ఉత్సవమూర్తులను ముందుగా గ్రామ మాడవీధులలో ఊరేగించి ఉద్యానవన మండపానికి తీసుకొచ్చారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం గడ్డితో చేసిన నరకాసుర విగ్రహాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మా ఊరు దీపావళి



దీపావళి గ్రామసూచిక బోర్డు

గార: శ్రీకాకుళం నగరానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో గార మండలంలో ఉన్న గ్రామం పేరు దీపావళి. ఈ పేరు వెనక పెద్ద చరిత్రే ఉంది. శ్రీకాకుళం ప్రాంతాన్ని పాలించే రాజు ప్రతిరోజూ గుర్రంపై కళింగపట్నం వెళ్తూ మార్గమధ్యలో శ్రీకూర్మం సమీపంలో లక్ష్మీనారాయణ గుడి వద్ద ఆగి స్వామిని దర్శించుకునేవాడు. ఓ రోజు గుడి వద్దకు వచ్చేసరికి సొమ్మసిల్లి పడిపోవడంతో అక్కడే ఉన్న వైష్ణవులు, గోవుల కాపరులు సపర్యలు చేశారు. మీరెవరు?ఇక్కడెందుకు ఉన్నారని రాజు ప్రశ్నించగా.. ఇక్కడికి కొద్ది దూరంలోనే తమ గుడిసెలున్నాయని, ఆ ప్రాంతానికి పేరు లేదని చెబుతారు. దీనికి స్పందించిన రాజు ఇకపై ఆ ప్రాంతాన్ని దీపావళిగా పిలవాలని, రికార్డుల్లో కూడా నమోదు చేస్తామని చెప్పి ఆ విధంగా చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి అదే పేరు స్థిరపడిందని గ్రామస్తులు చెబుతుంటారు.

సీఎం జగన్‌తోనే సామాజిక సాధికారత

- 15న నరసన్నపేట సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్లు

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సామాజిక సాధికారత సాధ్యమైందని కళింగవైశ్య, కాపు, కాళింగ, శ్రీశయన, రెడ్డిక, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, పేరాడ తిలక్, డి.పి.దేవ్, దుక్క లోకేశ్వరరెడ్డి, రాజాపు హైమావతి అన్నారు. నరసన్నపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. సామాజిక సాధికార బస్సుయాత్ర మూడు చోట్ల విజయవంతంగా జరిగిందని, ఈ నెల 15న నరసన్నపేటలోనూ యాత్ర జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర పొందర సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజాపు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం ప్రాణదాత.. కిడ్నీ రీసెర్చ్ సెంటర్

- సకల సౌకర్యాలతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి
- సీఎం జగన్ నిబద్ధతను కొనియాడిన ఐఎంఏ సభ్యులు
- మంత్రి సీదిరి అప్పలరాజుతో కలిసి ఆస్పత్రి సందర్శన



పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వద్ద ఐఎంఏ సభ్యులు, వైద్యులతో మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ:

దశాబ్దాలుగా ఉద్దాన ప్రాంతాన్ని వెంటాడుతున్న కిడ్నీ మహమ్మారి సమస్య త్వరలో ప్రారంభం కానున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులతో పరిష్కారం కానుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వీటిని త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో కలిసి శనివారం 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్లను ఐఎంఏ సభ్యులు పరిశీలించారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్యం అందిస్తున్న వైద్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు కలిసి ఆస్పత్రిలోని ప్రతి గదిని సందర్శించారు. సిటీ స్కాన్, ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ కేంద్రాలు తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మంత్రి అప్పలరాజులకు ఈ ప్రాంతంపై ఉన్న మమకారం, నిబద్ధత ఆస్పత్రి నిర్మాణంతో తేటతెల్లమైందన్నారు. కిడ్నీవ్యాధి బారినపడి దశాబ్దాలుగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని, ఇకపై ఈ ఆస్పత్రి ఎంతో మందికి ప్రాణదాతగా నిలుస్తుందన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వైద్య రంగంలో ఎంతో అనుభవం ఉన్న వైద్యులు సందర్శించడం ఆనందంగా ఉందని, ఆస్పత్రికి సంబంధించి ఆలోచనలు, సలహాలు, సూచనలు అందించగలితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ ప్రాంత వైద్యులుగా రోగులతో మమేకమై ఉన్నందున మరింత మెరుగైన సేవలు అందించేందుకు సూచనలివ్వాలని కోరారు. జగనన్న పాదయాత్ర సమయంలో కవిటి మండలం జగతి గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులతో ముఖాముఖి నిర్వహించారని, అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం డయాలసిస్ కేంద్రాల పెంపు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో రాజీపడలేదన్నారు. ఇంటింటా శుద్ధజలం అందించేందుకు సుమారు రూ.700 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు.

కొత్తమ్మతల్లి సన్నిధిలో 'కోటబొమ్మాళి పీఎస్' యూనిట్



అమ్మవారిని దర్శించుకుంటున్న విజయ్, శివానీ

కోటబొమ్మాళి: శ్రీకాకుళం నగరానికి చెందిన తేజ మార్ని దర్శకత్వంలో తెరకెక్కిన 'కోటబొమ్మాళి పీఎస్' సినిమా ఈ నెల 24న విడుదల కానున్న నేపథ్యంలో హీరో రాహుల్ విజయ్, హీరోయిన్ శివాని(నటుడు రాజశేఖర్ కుమార్తె), నిర్మాత బన్నీ వాసు శనివారం కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఈఓ వి.రాధాకృష్ణ, ఆలయ కమిటీచైర్‌పర్సన్ బోయిన మాధవి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సన్నిధిలో పాటలు విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రయూనిట్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లా రాజకీయాలు, జీవనశైలి, కోటబొమ్మాళి ప్రాంత నేపథ్యంతో సినిమా ఉంటుందన్నారు. సినిమాను ఆదరించాలని కోరారు.

ఆనందాల దీపావళి..

పాటిద్దాం నియమావళి

- వెలుగుల వేడుకలో జాగ్రత్తలు తప్పనిసరి
- టపాసుల కాలుష్యంతో ఆరోగ్యానికి ముప్పు
- నిబంధనలు పాటిస్తూ పండగ జరుపుకోవాలని వైద్యుల సూచన



ఇచ్ఛాపురం రూరల్/టెక్కలి/శ్రీకాకుళం కల్చరల్:

ముచ్చట గొలిపే రంగుల కాంతులతో ఆకాశాన్ని చీల్చుకుంటూ ఎగిరే తారాజువ్వలు.. కళ్లు మిరుమిట్లు గొలిపే మతాబులు...వెలుగులు విరజిమ్మే చిచ్చుబుడ్లు.. వీటి కోసం ఏడాది పొడవునా దీపావళి పండగ ఎప్పుడొస్తాందా అని ఎదురుచూస్తుంటాం. ఈ ఆనందం వెనుక మితిమీరిన కాలుష్యంతో వచ్చే వ్యాధులు పొంచి ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారికి ఈ కాలుష్యం మరింత ప్రమాదకరం. ఆస్తమా, బ్రాంకైటీస్, టీబీ తదితర బాధితులు తీవ్ర ఇబ్బందులు పడతారు. వృద్ధులు, గర్భిణులు కొన్ని సార్లు ఊపిరితీసుకోవడానికి ఇబ్బందిపడుతుంటారు. ఈ నేపథ్యంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సంవత్సరం దీపావళి నాడు నిర్దేశిత వేళల్లో టపాసులు కాల్చాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ నిబంధనలు పాటిస్తేనే నిజమైన పండగని పలువురు పేర్కొంటున్నారు.

శబ్దం హద్దులు దాటొద్దు..

- టపాసుల్లో టాక్సిక్ కారకాలైన రాగి, కాడ్మియం, సీసం, మెగ్నీషియం, జింక్, సోడి యం, పొటాషియం, గంధకం వంటి పదార్థాల ఉండటంతో శ్వాసకోస వ్యాధులకు కారణమవుతాయి. ముఖ్యంగా భూచక్రాలు, పాము మాత్రలు, మతాబులు,చిచ్చుబుడ్లు వల్ల అధికంగాపొగవ్యాపిస్తుంది.
- టపాసులు పేల్చినప్పుడు వెలుబడే ధ్వని అపరిమితంగా ఉంటుంది. బాణసంచా కాల్చేటప్పుడు 125 నుంచి 130 డెసిబుల్స్ శబ్దం వెలువడుతుంది. సాధారణంగా మనిషి వినికిడి శక్తి 50 డెసిబుల్స్ మాత్రమే. అంతకు మించి శబ్దాలను వింటే చెవికి నష్టం తప్పదు. కొంతమంది వినికిడి సమస్యల బారిన పడతారు. మరికొందరు అతి నిర్లక్షంగా వ్యవహరిస్తూ టపాసులను కాల్చుతూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటారు. ఈ పరిస్థితులు రాకుండా జాగ్రత్తలతో దీపావళిని జరుపుకుని తీపి గుర్తుగా మిగుల్చుకునేందుకు ప్రయత్నించడం ఉత్తమం.



అగ్ని ప్రమాదాలు సంభవిస్తే..

టపాసులు కాల్చే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే **100, 108** టోల్ ఫ్రీ నంబరుతో పాటు అగ్ని మాపక శాఖ కార్యాలయాలను వెంటనే సంప్రదించాలి..

అగ్ని మాపక కేంద్రం	ఫోన్ నంబర్
టెక్కలి	08945 244277
కోటబొమ్మాళి	08942 238659
సోంపేట	08947 234101
మందస	08947 237101
పలాస	08945 241101
ఇచ్ఛాపురం	08947 231101
నరసన్నపేట	08942 276777
ఆమదాలవలస	08942 286401
పొందూరు	08941 242101
శ్రీకాకుళం	08942 222099
రణస్థలం	08942 234499
కొత్తూరు	08946 258444

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- లైసెన్స్ ఉన్న దుకాణాల వద్ద బాణసంచా కొనుగోలు చేయాలి.
- పెద్దల పర్యవేక్షణలోనే చిన్నారుల బాణసంచా కాల్చాలి.
- విద్యుత్ తీగల కింద నిల్చుని టపాసులు కాల్చరాదు. కాటన్ దుస్తులను ధరించాలి
- కాకరపువ్వొత్తులు కాల్చిన వెంటనే వాటిని ఆర్పేందుకు సమీపంలో నీళ్ల డబ్బాలను ఉంచుకోవాలి.
- ఆరుబయట దీపావళి మందులు కాల్చాలి. ఇంట్లో కాల్చకూడదు.
- ఆస్పత్రుల సమీపంలో, పెట్రోల్ బంకులు ఉన్న ప్రాంతాల్లో కాల్చొద్దు.
- విధిగా పాదరక్షలు ధరించాలి, అందుబాటులో నీళ్ల పెట్టుకోవాలి.
- బాణసంచా కాల్చినప్పుడు గాయాలైతే వెంటనే చల్లని నీరు పోస్తే ఇన్నర్ లేయర్ కాలదు. తర్వాత వైద్యుడిని సంప్రదించాలి.

వారు జాగ్రత్త..



టపాసులు కాల్చే సమయంలో శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలి. పొగ బారిన పడకుండా చూడాలి. మాస్కులు ధరించి ప్రభావితం లేని బాణసంచా కాల్చాలి. ఆస్తమా ఉంటే మందులు అందుబాటులో ఉంచుకోవాలి. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు మరింత జాగ్రత్తగా ఉండాలి.

– బి.మహరాజ్, వైద్యుడు, జిల్లా ఆసుపత్రి, టెక్కలి

గాయాలను శుభ్రం చేయాలి



టపాసులు కాల్చే సమయంలో గాయమైతే వెంటనే నీరు పోయాలి. వీలైతే సబ్బుతో కడగాలి. లేకపోతే టాపాసుల్లో ఉండే పొటాషియం తదితర రసాయనాలు రక్తంలో కలిసి మరింత ప్రమాదానికి కారణమవుతాయి. 24 గంటల్లోగా డాక్టర్‌ను సంప్రదించాలి. లేకపోతే ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదముంది.

– డాక్టర్ వై.కల్యాణి, పీహెచ్‌సీ, కొళిగాం

ఇలా చేయవద్దు..



- పేలని టపాసుల వద్దకు వెళ్లి తొంగి చూడకూడదు.
- చేతుల్లో బాంబులు పేల్చడం హానికరం.
- గుడిసెలు ఉన్న ప్రాంతంలో తారాజువ్వలు వేయరాదు.
- జేబుల్లో బాణసంచా పెట్టుకోకూడదు.
- విద్యుత్ బల్బులు, డెకరేటివ్ బల్బులు అధికంగా పెట్టరాదు. వీటి వల్ల విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

• అభినయ మోహనా

స్వర్గాన విశ్రమించు.. మా జ్ఞాపకాల్లో జీవించు

- చంద్రమోహన్‌తో జిల్లావాసులకు అనుబంధం
- శ్రీకాకుళంలో సత్కరించిన సమాఖ్య సభ్యులు



మల్లే.. అని అమాయకంగా శ్రీదేవిని పిలిచిన చంద్రమోహన్ ఓ తరానికి అభిమాన కథా నాయకుడు..

ఝుమ్మంది నాదం అని జయప్రద తన్మయత్వంగా పాడుతుంటే సై అంది పాదం అనీ దప్పు కొట్టి జత కలిపిన చంద్రమోహన్ ఆ తరం అమ్మాయిల అందాల హీరో..

రెండు రెళ్ల ఆరు అని కొత్త ఎక్కాలు చెప్పిన చంద్రమోహన్ ఆ దశకానికి కామెడీ కింగ్..

నాన్నా నువ్వు అమ్మను కొట్టావా.. అని మెగాస్టార్ అడిగితే లేదు నాన్నా అని భయపడుతూ చెప్పిన చంద్రమోహన్ తర్వాతి దశకంలో కమెడియన్..

నా గుండెల్లో మంట... అంటూ 7/జీ బృందావన్ కాలనీలో ఏడ్చిన చంద్రమోహన్ ఈ తరానికి ఇష్టమైన నాన్న.. ఇలా ఆయన ప్రాణం పోసిన పాత్రలు తెలుగు తెరపై సంపూర్ణ ఆయుష్షు పొందాయి. ఆయన ఊపిరి ఊదిన సన్నివేశాలు ప్రేక్షకుల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించాయి. తెలుగు సినిమాను సుసంపన్నం చేసిన మహానుభావుల్లో ఈ చంద్రమోహను డు ఒకరు. ఆ మహానటుడు ఇక లేరు. ఆయన జ్ఞాపకాలు మాత్రం మనలోనే.. మనతోనే ఉన్నాయి.

శ్రీకాకుళం కల్చరల్:

హీరో, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఎన్నో సినిమాలతో తెలుగు, తమిళ ప్రేక్షకులని మెప్పించిన నటుడు చంద్రమోహన్ వయోభారంతో శనివారం మృతి చెందడంతో జిల్లావాసులు ఆయనతో జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. 2011లో స్నేహాంజలి ఆర్ట్స్ అకాడమీ(విశాఖపట్నం) ఆధ్వర్యంలో శ్రీకాకుళం వచ్చిన ఆయన్ను ఎందరో కళాకారులు, అభిమానులు కలిసి ఘనంగా సన్మానించారు. అదే వేదికపై శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ప్రతినిధులు చంద్రమోహన్‌ను సత్కరించారు. అంత పెద్ద సీనియర్ నటుడిని ప్రత్యక్షంగా చూడటం, మాట్లాడటం మరచిపోలేమని సమాఖ్య సభ్యులు ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బి.ఎంఎస్.పట్నాయక్, రామచంద్రదేవ్, చిట్టి వెంకటరావు తెలిపారు.



చంద్రమోహన్‌తో స్నేహాంజలి సభ్యులు

చంద్రమోహన్‌తో నటించా..

సీనియర్ నటుడు చంద్రమోహన్‌తో కలసి 'పెళ్లికోసం' సినిమాలో నటించానని పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారుడు, కవి, రచయిత గురుగుబెల్లి లోకనాథం తెలిపారు. ఆయన క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించగా తాను విలన్‌గా పలు సన్నివేశాల్లో నటించడం గొప్ప అనుభూతిగా పేర్కొన్నారు. ఆయన మరణం కళామతల్లికి, సినీ రంగానికి తీరని లోటని అన్నారు.

శ్రీకూర్మక్షేత్రంలో..

ఆనాడు శ్రీకాకుళానికి వచ్చిన చంద్రమోహన్‌ను కలవడం అదృష్టంగా భావిస్తున్నానని కళారత్న శిల్పి దివిలి అప్పారావు అన్నారు. శ్రీకూర్మనాథున్ని దర్శించుకునేందుకు క్షేత్రానికి వచ్చినపుడు ఆలయ విశిష్టతను వివరించానని గుర్తు చేసుకున్నారు.



రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యుల సత్కారం



శ్రీకూర్మంలో చంద్రమోహన్‌తో శిల్పి దివిలి అప్పారావు

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

- మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- వంశధార రిజర్వాయర్‌లో 5 లక్షల చేప పిల్లల విడుదల



రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడిచిపెడుతున్న మంత్రి అప్పలరాజు, ఎమ్మెల్యే రెడ్డిశాంతి

హిరమండలం: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం వంశధార రిజర్వాయర్‌లో స్వదేశీ మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రెడ్డిశాంతి, జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ పి.వి.శ్రీనివాసరావుతో కలిసి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా సుమారు ఐదు లక్షల చేపపిల్లలను విడిచిపెట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మత్స్యకారులకు లైఫ్‌జాకెట్లు, సబ్సిడీపై మోటార్ బోట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకార మహిళలకు అండగా ఫిష్ ఆంధ్ర కేంద్రాలను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే రెడ్డిశాంతి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అదనపు పరిహారాలను త్వరలో పంపిణీ చేస్తామని, నిర్వాసితులు ఆందోళన చెందవద్దన్నారు. మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 169 చెరువులతో పాటు రిజర్వాయర్‌లో 18 లక్షల పైబడి చేప పిల్లలను విడిచిపెట్టామన్నారు. కార్యక్రమంలో వంశధార ఎస్‌ఈ డోల తిరుమలరావు, ఏడీ సత్యనారాయణ, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు, ఉపాధ్యక్షులు రామారావు, మురళి, వంశధార ఈఈ ఎం.వి.రమణ, తహశీల్దార్ బి.మురళీమోహన్, మత్స్యశాఖ అధికారులు ముసలినాయుడు, రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల వైద్యానికి సాయం

సాక్షి ఎఫెక్ట్...



ఆర్థిక సాయం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుడు

ఇచ్ఛాపురం రూరల్/కాశీబుగ్గ: బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న కవల పిల్లలు శివంగి హర్షవర్దన్, హర్షితల శస్త్రచికిత్సకు సాయం అందించాలంటూ గత నెల 30న 'సాక్షి'లో ప్రచురితమైన 'చిన్ని ప్రాణాలకు ఆపద' కథనానికి దాతలు స్పందిస్తున్నారు. శనివారం బ్రాహ్మణతర్లాకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు కేశపురం వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు రూ.22,700 నగదు అందజేశారు. మరింత మంది దాతలు ముందుకువచ్చి ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

మెడికల్ పీజీ సెట్‌లో లావణ్య ప్రతిభ



జి.లావణ్య

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పీజీ అర్హత పరీక్షలో శ్రీకాకుళం నగరానికి చెందిన గురుగుబెల్లి లావణ్య ప్రతిభ కనబర్చింది. ఎన్‌ఐసెట్ జనవరి–2024 పీజీ అర్హత పరీక్షలో 488వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించింది. విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్ డిస్టెన్షన్‌లో ఉత్తీర్ణత సాధించిన లావణ్య నగరంలోని గుజరాతీపేటలో నివాసం ఉంటున్నారు. తండ్రి గురుగుబెల్లి జనక మోహనరావు, తల్లి పద్మావతమ్మ ఇద్దరు ఉపాధ్యాయులుగా పనిచేస్తుండగా, అన్నయ్య గురుగుబెల్లి వెంకటేష్ శ్రీకాకుళం రిమ్స్‌లో ఎంఎస్ జనరల్ సర్జన్‌గా సేవలు అందిస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడులు

శ్రీకాకుళం క్రైమ్ : లావేరు మండలం బుడుమూరు సమీపంలో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్సు పోలీసులు శనివారం దాడులు నిర్వహించినట్లు ఎస్‌బీ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. ఈ ఘటనలో ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన పది మంది పేకాటరాయుళ్ల నుంచి రూ.1,26,846 నగదు, 12 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు జరిగిన ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్సు సిబ్బంది, లావేరు ఎస్‌ఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సముద్రస్నానానికి వెళ్లి విద్యార్థి మృతి



వెంకట మణి మోహన్‌రావు (ఫైల్)

శ్రీకాకుళం రూరల్/బూర్జ: శ్రీకాకుళం రూరల్ మండలం పెదగనగళ్లవానిపేట బీచ్ వద్ద సముద్రతీర స్నానానికి వెళ్లిన బూర్జ మండలం కొల్లివలసకు చెందిన పాట్నూరు వెంకట మణి మోహన్‌రావు (17) ప్రమాదవశాత్తూ గల్లంతై మృతిచెందాడు. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మణి మోహన్‌రావు 12 మంది స్నేహితులతో కలిసి శనివారం కొల్లివలస నుంచి ఆటోలో పెదగనగళ్లవానిపేట బీచ్‌కు పిక్నిక్‌కు వెళ్లాడు. సాయంత్రం సముద్రంలో స్నానం చేస్తుండగా అలల తాకిడికి కొట్టుకుపోయాడు. కొంతసేపటి తర్వాత కొన ఊపిరితో ఒడ్డుకు కొట్టుకురావడంతో వెంటనే ఆటోలో రిమ్స్‌కు తీసుకొచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మణి మోహన్‌రావు బూర్జ మండలం తోటవాడ జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



నది ఒడ్డున మృతదేహం

కొత్తూరు: మండలంలోని వసప గ్రామం వద్ద వంశధార నదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. గ్రామ సర్పంచ్ వలురౌతు ఆఫీస్, వీఆర్వో పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ ఏంఏ అహ్మద్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి సుమారు 50 ఏళ్ల వయసుంటుందని, ఎడమ చేతిపై నబ లతిక అనే పేరుతో పచ్చబొట్టు ఉందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.